# తనదాకా వస్తే...!

—బి. కె. & యన్. కె.

అందమైన బంగళాలో అందమైనవాళ్ళే ఉండాలని, కనీసం ఉంటే బాగుం టుందని నమ్ముతాడు శ్రీహరిరావు. ఆయనుంటున్న బంగళా చాలా అందంగా ఉంది. దాని ఆవరణలో ఓచిన్న పూలతోటఉంది. బంగళాగోడలు తెల్లగా, ఇస్త్రీ చేసిన తెల్లచీరలా, నెహ్రూ ఫోటోలో భుజంమీద వాలిఉందేశాంతి కపోతం రెక్కలంత తెల్లగా వున్నాయి. మేకప్‌వల్ల అందమెక్కువైన సినీతారమొహంలా, బంగళా ముందున్న చిన్నపూలతోటవల్ల ఆ ఇంటికి అందం ఎక్కువైంది. శ్రీహరిరావు సిద్ధాంతం ప్రకారం అంత అందమైన బంగళాలో శ్రీహరిరావు ఉంటున్నాడు.

శ్రీహరిరావుకు ఏం తక్కువ? అని అతనివాళ్ళంతా ప్రశ్నించుకుని, ఏది తక్కువలేదని జవాబుకూడా తామే చెప్పుకుంటారు. శ్రీహరిరావుకు అందంఎక్కువ, చదువు ఎక్కువె, చేస్తున్న ఉద్యోగం సెషన్స్ జడ్జి కావడం మూలన జీతంకూడా ఎక్కువే. భార్య అందం, ఆమెవల్ల వచ్చినఆస్తి అదనపు అందంకాని శ్రీహరిరావుకు ఒకటి తక్కువ. పిల్లలులేరు "పిల్లలులేని కుటుంబం చింతలేని కుటుంబం" అనే ప్రభుత్వ సూక్తిని తను నమ్మాడేగాని, తన భార్యని నమ్మించలేకపోయాడు. ఆమెలో ఇలాంటి నమ్మకం బొత్తిగాలేదు.

కోర్టు అయిపోగానే ఇంటికివచ్చి ఫ్రెష్‌గా తయారై ఇంటిముందుతోటలో కూర్చుని ఆలోచిస్తాడు శ్రీహరిరావు. జడ్జీలుకూడా మనుషులేకాబట్టి చాలామందిలో కనిపించే బలహీనతలు ఉన్నాయి అతనిలో తన తెలివితేటలమీద ఆయన కపార నమ్మకం. ఏ మనిషినైనా చూడగానే అతని మనస్తత్వం కనిపెట్టగలననే నమ్మకం. సైకాలజీగూర్చి చాలా చదివాడు. సందర్భం వచ్చినచోట "ఫ్రాయిడ్" పేరు తీసుకరాకుండా ఉండలేదు అతని "నోషన్సు" చాలా విచిత్రంగా కన్పిస్తాయి.

మనస్తత్వ శాస్త్రాన్ని తనవృత్తిధర్మంలో కలిపి అద్భుతమైన ఫలితాలు సాధించాలని అతనికి అచంచలమైన విశ్వాసం కొత్తకాంగ్రేసువాళ్ళు బ్యాంకులీ జాతీయంచేసి, తద్వారా సోషలిజం సాధించాం అన్నట్లుగా, కోర్టులో ముద్దాయిని చూడగానే ఓ అభిప్రాయం ఏర్పర్చుకోగలడిట్ట. సెక్సు గురించి, సెక్సునేరాలను గురించి అతనికోగమ్మత్తయిన అభిప్రాయం చదువుకునేరోజుల్లో చాలా సెక్సు గ్రంధాలు చదివేవాడు.

"హేవలాక్ ఎల్లిస్" అభిప్రాయం ఫలానా సెక్సుకేసులో ఎలాగుంటుందీ అంటే ఠకీమనీ జవాబు చెప్పగలిగేవాడు. సెక్సుగురించి తన రూంమెట్సుతో వాదోప వాదాలు జరిగేవి. స్నేహితులంతా అతనికి అభినవ ఎల్లిస్ అనే బిరుదునిచ్చారు. యూరోప్‌లో పుట్టిఉంటే ఎల్లిస్‌ను బీట్ చేసి ఉండేవాడివన్నారు. తను ఉబ్బిపోయేవాడు సెక్సుగురించి రీసెర్చిచేసి ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు ఏమిటంటే 1 సంసార స్త్రీ వ్యభిచరించడానికి కారణం ఆమె భర్త అసమర్ధతే In other words ఆమెను తృప్తిపరచలేకపోవడం. సరే ఇహ మిగతాసిద్ధాంతాలు ఇప్పట్లో అప్రస్తుతం.

"జడ్జి"గారు ముంచాడంటవా? ఏంవన్నాకతికేరకంవా? అడిగాడు షాహుకారు బిళ్ళబంట్రోతుని.

"ఓరినీ ఆసాధనంగూలా యెలగన్నా వయ్యా ఆమాట. ఆమాట ఆ బాబునన్నోళ్ళనోట్లో అవి .... అవి పడతాయ్ తెల్సా ఆబాబంటే అల్లాటప్పా అను కున్నావా? ఎంతాస్తి? ఏం? తక్కువ నీలాటి నాలోటోళ్ళను లచ్చమందివి మిసీట్లమీద కొనిపారేస్తారు. అన్నాడు బిళ్ళబంట్రోతు షాహుకారు మనసు తృప్తిపడింది. ఆరోజు కోర్టునిండా జనమే. ఒకళ్ళచెవిలో ఒకళ్ళు ముచ్చట్లు "ఉరిశిక్షా? జన్మఖైదా? ఏదిస్తాడంటా?" ఒకళ్ళను ఒకళ్ళు ప్రశ్నించుకుంటున్నారు.

ఆ రోజు కోర్టులో లెక్చరర్ మధుగారి కేసులో తీర్పు. మధు తన భార్యను హత్యచేశాడని అభియోగం. భార్యను అతనెంతగానో ప్రేమించాడు. కాని ఏం లాభం? ఒకనాడు అతను కాలేజినుండి వచ్చేసరికి ఆమె వెరేవాడి గాఢాలింగనంలో ఉంది. మధుకు తలలో బాంబుప్రేలినట్లయింది. భూకంపం తిరిగొచ్చినట్లు. కలి యుగాంతానికి రాబోయే ప్రళయం అప్పుడే వచ్చేసినట్లు అంతే.... భార్యను అక్కడి కక్కడే చంపేశాడు".

జడ్జి శ్రీహరిరావుగారి తీర్పంటే అక్కడున్నవాళ్ళందరికి (కోర్టులో) లోగడ తీర్పులదృష్ట్యా బ్రహ్మాండమైనగురి.

పదకొండు గంటలైంది. సూర్యుడు ఆకాశానికొచ్చినట్లు క్రమంతప్పకుండా జడ్జిగారు కోర్టుహాలుకు వచ్చారు. తుఫాన్‌ముందు ప్రశాంతతలా హాలంతా నిశ్శబ్దంగా ఉంది. ఉరుము రాబోయేముందు మెరుపులా జడ్జిగారి వేలివజ్రపుటుంగరం రంగులు ట్యూబ్‌లైట్ కాంతికి గోడమీద ప్రసరిస్తున్నాయి గాలినిశబ్దంగా బిగుసుకుపోయింది. జడ్జిగారి చేతిలో కాగితాల రెపరెప ప్రజలచెవుల్లో డిటెక్టివ్ సినిమాలో విలన్ చెప్పుల చప్పుడులాగుంది. జడ్జిగారు గొంతు సవరించుకొని,

"ముద్దాయి భార్యను హత్యచేశాడని అభియోగం కారణం రెండవవారి అవినీతి. భార్యనడవడి మంచిదికాదని తెలిసినప్పుడు విడాకు లివ్వొచ్చును. ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చును. న్యాయస్థానా లెందుకున్నాయ్? (గద్దించారు). న్యాయాన్ని తనచేతిలోకి తీసుకునేహక్కు ముద్దాయికి లేదుకాకాలేదు. ఏ నేరానికైనా శిక్షార్హుడే. ఇంకా నాఉద్దేశం ప్రకారం భార్యల్లో అవినీతి ఎందుకు పెరుగుతుంది. (నాలుగు వైపులా చూచారు) కేవలం భర్తలోపం వల్లనే (తనసూత్రం ఇందులో ఉపయోగించుకోవడానికి అవకాశం వచ్చినందుకు పొంగిపోతు) అందుచేత ఈ దృష్టితోచూసినా ముద్దాయి శిక్షార్హుడే".

విద్యాధిడైవుండి క్షణికోద్రేకంలో ఇంత మహనేరం చేసినందుకు అ విద్య యొక్క సార్ధకత ఏమిటి? అందుకే ముద్దాయికి IPC 302వ సెక్షన్ క్రింద జన్మాంతర ఖైదు విధిస్తున్నాను"

మధు ముఖం వాలిపోయింది. తీర్పుకంటే జడ్జిగారి మాటలు మహబాధ పెడ్తున్నాయ్. ఆ మాటలే ఓ పెద్దశిక్ష!

జడ్జిగారు ఛెంబర్‌లోకి వెళ్ళారు. వారంట్‌పై సంతకంపెడ్తు బెంచి గుమస్తా ముహంలోకిచూసి ఖోజుగా నవ్వారు. "చూడండి! ఈ నేరాలన్నిటికీ భర్త అసమర్ధతే కారణం, వాడు చక్కగాఉంటే ఇలాంటి దుస్సంఘటనలకు అవకాశం తక్కువ.

సమస్తామనసులో ఏమనుకున్నాడో ఏమోగాని పైకి మాత్రం

"చిత్తం! కాదుమరి! అనేశాడు.

ఆ రోజు సాయంత్రం చాలా అందంగా ఉంది.

బంగరంలాఉంది ఎండ. గాలికి జడ్జిగారి బంగళాలోని చెట్లు తలలూపు తున్నాయ్. జడ్జిగారి మనసు మహగంతువేస్తుంది. భార్య బుగ్గమీద చిన్నగా చితికవేసి "ఏమోయ్ నేనలా క్లబ్‌కెళ్ళొస్తా, నాలా ఆలస్యం కావచ్చు. నువ్ భోంచేసి పడుకో, ఈ రోజు 20_40 (Twenty Forty) రమ్మీ ఆడాలి" అన్నారు.

"ఎప్పుడూ! పేకాటేనా? ఈరోజు మీరుండాల్సిందే మల్లెపూలు జడ్జిగారి చూపిస్తూ గోముగా అంది. ఆచూపు బ్రుహన్నలకి వేడిపుట్టించేలాఉంది. ప్రవరుడి దీక్ష నిమిషంలో వమ్ముచేసేలాఉంది. శ్రీరాముడి ఏకపత్ని వ్రతభంగం కావించేలా ఉంది. కాని జడ్జిగారి దీక్షమాత్రం మార్చలేకపోయింది. పిచ్చిప్రెయసి! పన్నెండు కొట్టెసరికెల్లా నీముందువాలనూ" హుశారుగా ఈలవేస్తు కారుకేసినడిచారు.

ఆ రోజు క్లబ్‌లో ఆట బాగాసాగలేదు. శ్రీహరిరావుకు తనలో సమాన మైన అంతస్తు గలవాళ్ళతో అడటం సరదా. అలా అయితేనే హాయిగా ఉంటుందంటాడు సుందర్‌రావు అంటే శ్రీహరిరావుకు ఎంలో ఇష్టం కారణంపైన చెప్పిన లక్షణాలు అతనివద్దే ఉన్నాయ్. జోక్సేకట్‌చేస్తు ఆడుతూఉంటే చాలాబాగాఉండేది. ఆయనలేని లోటు బాగా కనబడుతోంది మొదట్లో సుందర్‌రావు ఆరోజు క్లబ్‌కు రాలేదని తెలిసి క్షణంలో రాజభరణాలు రద్దయ్యాయన్న వార్తవిన్న మాజీ మహరాజులా అయ్యాడు. పదకొండు గంటదాకా అలాగే ఆడిలేచాడు. తిన్నగా ఇంటికి వచ్చాడు. బంట్రోతు లేవరూలేరు. తిన్నగా డాబా మెట్లెక్కి తనగదిలోకి పోబోయాడు. లోపల సుందర్రావు. తనభార్య మాట్లాడుతున్నారు. "ఉండండి! వారు పన్నెండుగంటదాకకాని రారు" అంటోంది తన దర్మపత్ని. కాని అతనులేచి బయటికివచ్చి హుందాగా సిగరెట్‌పొగ గాలిలోకి వదల్తూ మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

శ్రీహరిరావుకు ప్రపంచమంతా గిర్రున తిరిగినట్లనిపిస్తోంది. ఇప్పుడు తానెక్కడున్నట్లు? కోర్టులోనా? క్లబ్‌లోనా? ఇంట్లోనా? ఏంచేయాలి తనిప్పుడు? ఏంచెయ్యాలి లోలోన రగులుతున్నఅగ్ని.. అగ్నిపర్వతంలా బ్రద్దలౌతుంది. చంపేస్తే? అంతరాత్మ వైద్యంగా అంది-ఏంలాభం! "విధ్యాధికుడైవుండి .... తన మాటలు టేప్‌రికార్డర్ ఆన్‌చేసినట్లుగా వినిపిస్తున్నాయ్.

విడాకులు— అబ్బో పరువూ ప్రతిష్ఠా ఏంగానూ?

ఎట్లా? ఈమంట ఆరెదలా?—ఆరదు—

ఈ మంటారదు—బ్రతికినంతకాలం ఈ మంటారదు—"అలాగే నిలబడ్డారేం? లోపలికిరండీ" పూర్వంలాగే శ్రీమతి కంఠంలోవిని ఎంచింది—లోపలికి నడిచాడు.

ఆ రాత్రి చుక్కలులేవు. ఆకాశంలో, చంద్రుడులేడు తనస్థానంలో "వసూ! నువ్ లేకపోతే నేను బ్రతుకలేను" శ్రీహరిరావు భార్యను గాఢంగా తనలోకి అదుముకుంటు.

ఆ తర్వాత ఏ ముద్దాయి (సెక్స్) శ్రీహరిరావు చేతిలో శిక్షపొందలేదు. తన సిద్దాంతం తన విషయంలొనే ఎందుకు తారుమారైందో తన సుఖాన్ని ఎందుకు కబళించింది, అనే ప్రశ్నకు సమాధానం దొరకక్క పాపం బ్రతుకుతున్నాడు శ్రీహరిరావు.


# SRINIVASA

TYPEWRITING & SHORTHAND INSTITUTE

Opp: Collectorate: Nalgonda.

BEST COACHING CENTRE

FOR

TYPEWRING & SHORTHAND (ENGLISH & TELUGU)

Jobwork, Translations, Duplicating works also be undertaken.